# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 31 । అక్టోబర్ । 2024






**డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు**

కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-14 క్రికెట్ పోటీల్లో తొలి దశ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. -8లో



**అటవీ పరిధిలో స్మగ్లర్ల అరెస్టు**

బద్వేల్ అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు స్మగ్లర్లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. కడప డీఎఫ్ఓ కార్యాలయంలో డీఎఫ్ఓ వినీత్ కుమార్ వివరాలు వెల్లడించారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.1/25.2

**వాతావరణం**

జిల్లాలో బుధవారం 25.2 - 34.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

# ప్రజలతో మమేకం

అభిమాన నాయకుడితో మాట్లాడాలని కార్యకర్తలు... పంట నష్టాల గురించి చెప్పుకోవాలని రైతులు.. ఓ సారి కలిసి కష్టాలు పంచుకోవాలని ప్రజలు.. రాష్ట్ర నలుమూలల నుంచి వెల్లువలా తరలివచ్చారు. వెరసి పులివెందులలోని భాకరాపేట క్యాంపు కార్యాలయం జనసంద్రమైంది.

ఆయనా అంతే.. ప్రతి ఒక్కర్నీ ప్రేమగా పలకరించారు. ఆత్మీయ కరచాలనం చేశారు.. భుజంపై చేయి వేసి గుండె నిండా ధైర్యమిచ్చారు. కష్టాలు తాత్కాలికమేనని.. మళ్లీ మంచి రోజులొస్తాయని కొండంత భరోసా ఇచ్చారు. తన కోసం శ్రమకోర్చి వచ్చిన ప్రజలతో మాజీ సీఎం వైఎస్ జగన్ మమేకమైన తీరిది.

- నేతలు, కార్యకర్తలతో ఆత్మీయ పలకరింపు
- కష్టాలు తాత్కాలికమేనంటూ రైతులకు భరోసా
- సమీప బంధువులతో ముచ్చట
- నూతన జంటలకు ఆశీర్వాదం
- పులివెందుల క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్



వైఎస్సార్ సీపీ నాయకుడు విద్యానందరెడ్డి ఇంటికి వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు

**సాక్షి ప్రతినిధి, కడప:** పులివెందులలోని భాకరాపురం క్యాంపు కార్యాలయం రోజంతా సందడిగా మారింది. తనను కలవడానికి వచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులతో వైఎస్ జగన్ మమేకమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు మాజీ నేతలతో పలువిషయాలు చర్చించారు. అధైర్యపడొద్దని పార్టీ అండగా ఉంటుందని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ప్రతీ కార్యకర్తకు ఆయా నేతలు అండగా నిలవాలని ఆదేశించారు.

**బంధువులతో సమావేశం...**

వయోభారంతో ఉన్న పెద్దనాన్న వైఎస్ ప్రకాష్‌రెడ్డి ఇంటికి వెళ్లి మాజీ సీఎం వైఎస్ జగన్ సమావేశమయ్యారు. ఆరోగ్య సమస్యలు తెలుసుకొని తగు సూచనలు చేశారు. అక్కడే ఉన్న వైఎస్ మనోహర రెడ్డి, వైఎస్ మధురెడ్డి తదితరులతోపాటు ఇతర బంధువుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మరో సమీప బంధువు శ్రీధర్‌రెడ్డి కుమారుడు యశ్వంత్‌రెడ్డి, శ్రీనిజ జంటను ఆశీర్వదించారు. అలాగే దొండ్లవాగు వైఎస్సార్‌సీపీ నాయకుడు విద్యానందరెడ్డి సోదరి వివాహం కాగా, ఆయన ఇంటికి వెళ్లి నూతన జంట మాధురీ, నరేంద్రరెడ్డిలను ఆశీర్వదించారు. అక్కడే ఉన్న వారి బంధువర్గాన్ని పేరుపేరునా పలకరించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

**పార్టీ నేతలతో ప్రత్యేక భేటీ:** కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, కడప మేయర్ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు పోచంరెడ్డి రవీంద్రనాథరెడ్డి, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, ఎస్‌బీ అంజాద్ బాషా, డాక్టర్ సుధీర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సాయినాథ శర్మ తదితరులతో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయా నేతలకు తగు సూచనలు చేస్తూ పార్టీ ఉన్నతికి కృషి చేయాలని ఆదేశించారు. కష్టకాలంలో పార్టీకోసం కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందని వివరించారు.



కొత్త జంట మాధురీ, నరేంద్రరెడ్డిలకు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందన



ప్రజల సమస్యలను ఆలకిస్తూ..



వైఎస్ జగన్‌కు శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న అభిమానులు



ఓ సోదరి సమస్యను వింటున్న జగన్



జగనన్నను కలిసిన ఆనందంలో ఓ చెల్లి



అభిమాన నాయకుడిని కలవడానికి వచ్చిన ఆనందంలో అభిమానుల కేరింతలు

## మంచి రోజులు వస్తాయి...

కూటమి సర్కార్ నిర్లక్ష్యం, అధికారపార్టీ నేతల ఆగడాలపై వివరిస్తూ వచ్చిన కేడర్‌కు మంచి రోజులు వస్తాయి, ఓపిక పట్టాలని వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించారు. దౌర్జన్యాలకు జడిసే పరిస్థితి లేదని, వ్యవస్థ తన పని తాను చేసుకెళ్లాలని సూచించారు. ఎప్పుడూ కాలం ఒకేలా ఉండదన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కొంతమంది అధికారులనుద్దేశించి వ్యాఖ్యానించారు. పక్షం రోజుల క్రితం పెద్దదండ్లూరు గ్రామ వైఎస్సార్ సీపీ నేత హనుమంతరెడ్డిపై దాడి జరిగిందని, మళ్లీ బుధవారం హత్యాయత్నం వెనుక అధికార పార్టీ హస్తం ఉందని పలువురు మాజీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అధికార పార్టీ ప్రమేయంతో హత్యాయత్నానికి గురైన హనుమంతరెడ్డికి మెరుగైన వైద్య చికిత్సలు అందించేందుకు తోడ్పాటునందించాలని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డిని ఫోన్‌లో ఆదేశించారు. అలాగే ఆరుగాలం శ్రమించినా పంటలు గిట్టుబాటు కాలేదని పలువురు రైతులు వివరించడంతో మనోస్థైర్యం కోల్పోవద్దు, మంచిరోజులు రానున్నాయని భరోసా కల్పించారు.

## న్యూస్‌రీల్

### 5న సమావేశం

**కడప సెవెన్‌రోడ్స్:** జిల్లా సమీక్షా కమిటీ సమావేశం నవంబరు 5వ తేది కలెక్టరేట్‌లో నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత ఈ సమావేశానికి రానున్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాల అమలు, ఇతర సమస్యలను ఈ సమావేశంలో చర్చించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ఆహ్వానాలు పంపారు. అన్నిశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు.

### స్పెషల్ కలెక్టర్‌గా శ్రీనివాసులు



**కడప సెవెన్‌రోడ్స్:** భూ సేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్‌గా జి.శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం నగరానికి చెందిన ఆయన గతేడాది నవంబరు నుంచి ఈ ఏడు ఆగస్టు వరకు కుప్పం ఆర్డీఓగా పనిచేశారు. ఆ తర్వాత పోస్టింగ్ కోసం ఎదురు చూస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను కడప భూ సేకరణ విభాగం స్పెషల్ కలెక్టర్‌గా నియమించింది. కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

### మంత్రి కార్యాలయంలో ప్రజా దర్బార్

**రాయచోటి టౌన్:** పట్టణంలో రాష్ట్ర రవాణా, క్రీడల, యువజన శాఖల మంత్రి మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి తన కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో నెలలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను వెంటనే పరిష్కారం చేసేందుకు ప్రజాదర్బార్ ఉపయోగపడుతుందని చెప్పారు.

### సౌత్ కొరియాకు వైవీయూ ఆచార్యులు



ఆచార్య ఎం.వి. శంకర్

**వైవీయూ :** యోగి వేమన విశ్వవిద్యాలయంలోని సైన్స్ అండ్ నానో టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆచార్యులు డా.ఎంవీ.శంకర్ సౌత్ కొరియాకు పరిశోధకుడిగా ఎంపిక య్యారు. అంతర్జాతీయ స్థాయిలో 81 మంది పరిశోధకులను బ్రెయిన్‌పూల్ ఫెలోలుగా ఎంపిక చేయగా అందులో ఆచార్య ఎం.వి శంకర్‌కు స్థానం దక్కింది. సూక్ష్మ పదార్థాలను ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై జరిగే పరిశోధనల్లో ఆయన పాల్గొంటారు. వైవీయూ వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, ఆచార్యులు డాక్టర్ మమత, పరిశోధకులు, విద్యార్థులు, శంకర్‌ను అభినందించారు.

# ఉరుసుకు ఏర్పాట్లు ముమ్మరం

**ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్**





మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

**కడప సెవెన్‌రోడ్స్:** నవంబర్ 3వ తేదీ నుంచి నవంబర్ 21వ తేదీ వరకు జరుగనున్న 'కడప పెద్ద దర్గా'ఉరుసు మహోత్సవ ఏర్పాట్లను ముమ్మరం చేయాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోదర్గా ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్లపై ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఆర్వో గంగాధర్ గౌడ్, అమీన్ పీర్ దర్గా మేనేజర్ మహ్మద్ అలీఖాన్, ఆర్డీఓ జాన్ ఇర్విన్, నగర కమిషనర్ మనోజ్ రెడ్డి, ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా నవంబర్ 3వ తేదీ 'ఝలా'కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు దర్గా కమిటీ సభ్యులు అందరూ ఎలాంటి కొరత లేకుండా సమన్వయ సహకారం అందివ్వాలన్నారు. ఈ ఉరుసు మహోత్సవానికి లక్షలాది మంది భక్తులు వస్తారని వారికి ఎటువంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్యం ,రోడ్లు, విద్యుత్, మంచినీరు వసతులకు ఎలాంటి కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం శాఖల వారీగా చేస్తున్న ఏర్పాట్లపై ఇంచార్జి కలెక్టర్ సమీక్షించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ పోలీస్ శాఖ అన్ని కోణాలలో భద్రత ఏర్పాట్లను చేపట్టిందన్నారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉరుసు మహోత్సవాన్ని జరిపించడంలో పోలీసు శాఖ అన్ని రకాల భద్రతా చర్యలను చేపట్టిందని వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, ఫైర్ అధికారి ధర్మారావు, ఆర్టీసీ ఆర్ ఎం గోపాల్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్, డీఐ పీఆర్వో వేణుగోపాల్ రెడ్డి, నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

**కడప సెవెన్‌రోడ్స్:** జిల్లాలో ఓటర్ల స్పెషల్ సమ్మరి రివిజన్ సాగుతోంది. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ మేరకు ముసాయిదా జాబితా విడుదల చేశారు. ఈ జాబితా మేరకు జిల్లాలో 8,02,150 మంది పురుషు లు, 8,38,981 మంది మహిళలు, 216 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు లేదా క్లెయిమ్‌లను నవంబరు 28వ తేది వరకు సమర్పించాల్సి ఉంటుంది. నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ఓటర్ల నమో దు కోసం స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. డిసెంబరు 24వ తేది నాటికి క్లెయిమ్‌లు, అభ్యంతరాలను డిస్పోజ్ చేస్తా రు. ఓటర్ల తుది జాబితా వచ్చే ఏడాది జనవరి 6వ తేది విడుదల చేయనున్నారు. ముసాయిదా జాబితా ప్రకారం జండర్ రేషియో జిల్లాలో 1046 ఉంది. కాగా జిల్లాలోని బద్వేలు నియోజకవర్గంలో 2,19,815 మంది ఓటర్లు ఉన్నారు. కడప నియోజకవర్గంలో 2,84,220, పులివెందుల 2,29,867, కమలాపురం 2,04,626, జమ్మలమడుగు 2,42,742, ప్రొద్దుటూరు 2,48,074 , మైదుకూరు 2,12,003 ఓటర్లు ఉన్నారు.

# వెలుగు పూల జావళి



కడప మున్సిపల్ మైదానంలోని స్టాల్‌లో ప్రజల రద్దీ





టపాసులు కొనుగోలు చేసి తీసుకు వెళుతున్న జనం

**కడప కల్చరల్:** ఇంటింటా దీపాలు.. కంటికి ఇంపైన రంగులు.. మనసు దోచే వెలుగులు.. ఇంటి ముంగిళ్లలో.. గోడలపైన వరుసలు కట్టిన ప్రమిదలు.. నింగిలోని చుక్కలు నేలకు దిగినట్లు తళుక్కుమనే దీపకాంతులు... వీధుల్లో నక్షత్రాలు విసిరేసినట్లు చూసినంత మేర దీపావళి కాంతులు.. దీపావళి పండుగ సందర్భంగా కనిపించే దృశ్యాలివీ. జిల్లాలోనూ పండుగ సందడి మొదలైంది. దీపావళి అంటేనే వెలుగు పూల పండుగ. ప్రతి ఇంటి ముందు దీపాల తోరణాలు కనిపిస్తాయి. వీధుల్లో బాణసంచా సందడి కనిపిస్తుంది. జీవితంలో కష్టాలను చీకటితో పోల్చి విజయాల వెలుగులు అందరికీ దక్కాలన్నది ఈ పండుగ అందించే సందేశం. ఇక ఈ పండుగంటే పిల్లల్లో కొత్త ఉత్సాహం ఉరకలెత్తుతుంది. టపాసులు చూడగానే వారి మనసు ఉప్పొంగిపోతుంది. కరకరలాడే కాకర పూవ్వొత్తులు, చిరచిరలాడే చిచ్చుబుడ్లు, రివ్వున ఎగిరే తారాజువ్వలు, చెవులు దిమ్మెక్కించే లక్ష్మి పటాసులు, బుసలు కొడుతూ పొంగే పాము బిళ్లలు, వెలుగులు చిమ్మే వెన్నముద్దలు, భూ చక్రాలు, విష్ణు చక్రాలు వెరసి దీపావళి అంటే టపాసుల పండుగ.



**మార్వాడీల సంప్రదాయం**

జిల్లాలో రాజస్థాన్, గుజరాతీ మార్వాడీలు మరింత సందడిగా ఈ పండుగను నిర్వహిస్తారు. జిల్లాలో దాదాపు 3,000 దాక మార్వాడీల కుటుంబాలు ఉన్నాయి. కేవలం కడప నగరంలోనే 700కు పైగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కుటుంబాలు నివాసముంటున్న బీకే ఎం, వైవీ స్ట్రీట్ ప్రాంతాలు కళగా మారాయి. ఇక టపాసుల దుకాణాలు ఎప్పట్లాగే కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. టపాసుల తర్వాత పూజా సామాగ్రికి పెద్ద డిమాండ్ ఏర్పడింది. ఈ పండుగకు స్వీట్లు పూజలో ఉంచడం సంప్రదాయం గనుక స్వీట్ల దుకాణాల వద్ద కూడా జనం సందడి కనిపించింది. పూల దుకాణాల వద్ద తీవ్ర రద్దీ కనిపించింది. వస్త్రదుకాణాలలో జనం అధికంగా కనిపించారు.

## క్లుప్తంగా

### 22 మంది బైండోవర్



ముద్దాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న కొండారెడ్డి

పోరుమామిళ్ల : మద్యం రవాణా కేసులో ముద్దాయిలుగా ఉన్న వారిని బుధవారం స్టేషన్‌కు పిలిపించి ఎస్ఐ కొండారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరలా నేరాలకు పాల్పడవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని 22 మందిని ఆయన హెచ్చరించారు. ముందు జాగ్రత్త చర్యగా వారిని తహసీల్దారు ఎదుట బైండోవర్ చేశారు.

### ఆటో బోల్తా పడి మహిళ మృతి



మృతిచెందిన మల్లీశ్వరి

మైదుకూరు : మైదుకూరు–వనిపెంట రహదారిలోని విశ్వనాథపురం సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడి మల్లీశ్వరి(45) మృతిచెందింది. మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన మల్లీశ్వరి కడపలో నివాసం ఉంటోంది. బుధవారం కడప నుంచి మైదుకూరుకు వచ్చి ఆటోలో స్వగ్రామానికి తిరిగి బయల్దేరింది. విశ్వనాథపురం సమీపంలో ఆటోకు కుక్కలు అడ్డం రావడంతో బోల్తా పడినట్లు తెలుస్తోంది. సంఘటనలో మల్లీశ్వరికి తీవ్రగ గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### ఆక్సిజన్ ట్యాంకరు బోల్తా



ముద్దనూరు సమీపంలో బోల్తాపడిన ట్యాంకరు

ముద్దనూరు : కడప–తాడిపత్రి జాతీయ రహదారిపై మండలంలోని ఉమ్మారెడ్డిపల్లె వద్ద బుధవారం ఆక్సిజన్ లోడ్‌తో వెళ్తున్న ట్యాంకరు బోల్తా పడింది. స్థానికుల సమాచారం మేరకు చెన్నై నుంచి ముంబయికి వెళ్తున్న ట్యాంకరు ఎదురుగా వస్తున్న ఓ స్కూటర్‌ను తప్పించబోయి రోడ్డు పక్కన బోల్తాపడింది. ట్యాంకరు డ్రైవర్‌కు స్వల్ప గాయాలవడంతో జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# టపాసులతో.. సాహసం వద్దు

### అగ్ని ప్రమాదాలు సంభవిస్తే...

టపాసులు కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 108 టోల్ ఫ్రీ నెంబర్‌తోపాటు అగ్నిమాపక శాఖ కార్యాలయాలకు సమాచారం ఇవ్వాలి.

| అగ్నిమాపక కేంద్రం | ఫోన్ నెంబరు |
|---|---|
| డీఎఫ్ఓ కార్యాలయం, కడప | 08562–241739 |
| కడప | 08562–242299 |
| ప్రొద్దుటూరు | 08564–252999 |
| జమ్మలమడుగు | 08560–270099 |
| పులివెందుల | 08568–286177 |
| కమలాపురం | 08563–274250 |
| బద్వేలు | 08569–284099 |
| మైదుకూరు | 8790201101 |
| పోరుమామిళ్ల | 9963737637 |
| వేంపల్లె | 94417 68101 |

కడప కోటిరెడ్డి సర్కిల్ : అజ్ఞాన చీకట్లను పారదోలే చిరుదివ్వెల పండగ దీపావళి. ముచ్చట గొలిపే రంగుల కాంతులతో ఆకాశాన్ని చీల్చుకుంటూ ఎగిరే తారాజువ్వలు, కళ్లు మిరుమిట్లు గొలిపే మతాబులు, వెలుగులు విరజిమ్మే చిచ్చుబుడ్లు కోసం ఏడాది పొడవునా దీపావళి పండుగ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తుంటాం. అయితే కొన్ని జాగ్రత్తలు పాటించకుండా ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ప్రమాదాలను కొని తెచ్చుకుంటారని అగ్నిమాపక అధికారులు హెచ్చరిస్తున్నారు.



### ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- లైసెన్సు ఉన్న దుకాణాల వద్ద బాణ సంచా కొనుగోలు చేయాలి.
- పెద్దల పర్యవేక్షణలోనే చిన్నారులు బాణసంచా కాల్చాలి.
- విద్యుత్తు తీగల కింద నిలబడి టపాసులు కాల్చరాదు. కాటన్ దుస్తులను ధరించాలి.
- కాకరపు వొత్తులు కాల్చిన వెంటనే ఆర్పేందుకు నీళ్ల డబ్బా దగ్గర ఉంచుకోవాలి.
- ఆరు బయట టపాసులు కాల్చాలి. ఆస్పత్రులు పెట్రోలు బంకుల వద్ద కాల్చరాదు.
- బాణ సంచా కాల్చినపుడు గాయాలైతే వెంటనే నీరు పోస్తే ఇన్నర్ లేయర్ కాలదు. తర్వాత వైద్యుడిని సంప్రదించాలి.
- పేలని టపాసుల వద్దకు వెళ్లి తొంగి చూడరాదు. చేతుల్లో పేల్చడం హానికరం.
- గుడిసెలు ఉన్న ప్రాంతంలో తారాజువ్వలు వేయరాదు. జేబుల్లో బాణసంచా పెట్టుకోరాదు
- విద్యుత్తు, డెకరేటివ్ బల్బులు అధికంగా పెట్టరాదు. వీటితో షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

### దీపావళి శుభాకాంక్షలు

– జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు



కడప అర్బన్ : జిల్లా ప్రజలకు, జిల్లా పోలీసు సిబ్బందికి, మీడియా మిత్రులకు ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ దీపావళి చీకట్లను పారద్రోలి ప్రజల జీవితాల్లో మరిన్ని కాంతులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా జరుపుకొనే ఈ దీపావళి పర్వదినాన ఆనవాయితీగా వచ్చే బాణసంచాను సరైన జాగ్రత్తలతో కాల్చాలని, పిల్లల పట్ల తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా వుండాలని కోరారు.

### వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలి



టపాసులు కాల్చే సమయంలో శ్వాస కోశ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలి. పొగబారిన పడకుండా చూడాలి. మాస్కులు ధరించి ప్రభావితం లేని బాణసంచా కాల్చాలి. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య నిపుణులు, కడప

### గాయాలను శుభ్రం చేయాలి



టపాసులు కాల్చే సయంలో గాయమైతే వెంటనే నీరు పోయాలి. వీలైతే సబ్బుతో కడగాలి. లేకపోతే టపాసుల్లో ఉండే పొటాషియం, తదితర రసాయనాలు రక్తంలో కలిసి మరింత ప్రమాదానికి కారణమవుతాయి. ఇన్‌ఫెక్షన్ రాకుండా వైద్యుడిని సంప్రదించాలి.

– డాక్టర్ కరుణాకర్, వైద్య నిపుణులు, రిమ్స్, కడప

## అధికారుల నిర్లక్ష్యంతోనే ఇసుక గొడవ

ప్రొద్దుటూరు : అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రొద్దుటూరు మండలం రామాపురం గ్రామం వద్ద టీడీపీ కార్యకర్తల మధ్య పరస్పర దాడులకు దారి తీసిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గురివిరెడ్డి ఇసుక దందాకు అడ్డే లేకుండా పోయింది. పెన్నా నది ఒడ్డునే గ్రామం ఉండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఈయన అక్రమ రవాణా దందా కొనసాగిస్తున్నారు. ప్రొద్దుటూరుకు ఇసుకను తరలించి అమ్మడం రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలిసినా గ్రామానికి అలా వెళ్లి ఇలా మొక్కుబడిగా తిరిగి రావడం పరిపాటిగా మారింది. ఇది ఆసరాగా చేసుకుని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వర్గీయుడు గురివిరెడ్డి పెన్నానదిలో చెక్ పోస్టు తరహాలో గేట్ ఏర్పాటు చేశాడు. బండికి, ట్రాక్టర్‌కు ఇసుక తీసుకెళ్లాలంటే ధర నిర్ణయించి.. ఆ మొత్తం చెల్లిస్తేనే బండి లేదా ట్రాక్టర్‌ను పెన్నానదిలోకి అనుమతి



సంఘటనా స్థలంలో దాడి చేస్తున్న గురివిరెడ్డి

స్తానని ఖరాఖండిగా చెబుతున్నారు. బుధవారం గ్రామంలోని టీడీపీ వర్గీయులే పరస్పర వాగ్వాదానికి దిగడంతో విషయం మళ్లీ వెలుగులోకి వచ్చింది. గతంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న తహసీల్దారు గంగిరెడ్డి భాస్కర్‌రెడ్డి జీపును అడ్డుకుని 'నా జోలికి వస్తే నీ జీపు కాలుస్తా' అని గురివిరెడ్డి హెచ్చరించిన సంఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది. పోలీసులు, అధికారుల్లోనూ.. ఆయన ఆగడాలను అడ్డుకునేవారే లేకుండాపోయారు.

## బి.మఠంలో మాజీ ఉపరాష్ట్రపతి సతీమణి

బ్రహ్మంగారిమఠం : మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సతీమణి ఉషారాణెమ్మ బుధవారం పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మంగారి మఠం చేరుకున్న ఆమెకు తహసీల్దారు దామోదర్‌రెడ్డి, మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు, స్వామి చిత్రపటాన్ని పూర్వ మఠాధిపతి కుమారుడు బ్రహ్మయ్య అందజేశారు. అనంతరం ఈశ్వరీదేవిమఠం, పోలేరమ్మ ఆలయాల్లో ఆమె ప్రత్యేక పూజలు జరిపారు. మఠాధిపతి వీరకుమార స్వామి దంపతులు ఉషారాణెమ్మకు చీర, సారె అందజేశారు. అనంతరం అహోబిలం వెళ్లారు. కార్యక్రమంలో అధికారులు జాన్స్, కుమారగంగయ్య, బీజేపీ నాయకులు



మాజీ ఉపరాష్ట్రపతి సతీమణికి బ్రహ్మంగారి చిత్ర పటం అందజేస్తున్న నిర్వాహకులు

ప్రభాకర్‌నాయుడు, లక్ష్మీదేవి,, మాచునూరు సుబ్బరాయుడు, బీపీ.ప్రతాప్‌రెడ్డి, పెద్దిరెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ ఎస్ఐ చంద్రశేఖర్ ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎనిమిది ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

కమలాపురం : కడప–తాడిపత్రి రహదారిలో కమలాపురం వద్ద పాపాఘ్ని నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి దాడులు చేసి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఖాజీపేటకు చెందిన పలువురి ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ ఉచిత ఇసుక అనేది నిర్దేశించిన ప్రాంతంలోనే తీసుకెళ్లాలని, ఎక్కడ పడితే అక్కడ నుంచి ఇసుక తరలించరాదని సూచించారు.

## ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఆత్మహత్య

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రవీంద్ర నగర్‌లో నివాసముంటున్న వృద్ధుడు నాగేశ్వరరావు(73) బుధవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఇంట్లో గత కొద్ది కాలంగా ఆయన ఒంటరిగా ఉంటున్నారు. మానసికంగా కుంగిపోయి ఈ నెల 29న వాస్మాల్ ద్రావణం తాగాడు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈయన పెథాలజీ విభాగంలో హెచ్‌ఓడీగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన తరువాత ఓ రక్తదాన సేవా సమితిలో ఉన్నారు. ఆయన తన భార్య, పిల్లలకు దూరంగా ఉన్నారు. ఆయన కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి



రెడ్డెప్పరెడ్డి(ఫైల్)

కురబలకోట : విద్యుత్ షాక్‌తో ఓ రైతు మృతి చెందిన విచారకర సంఘటన బుధవారం కురబలకోట మండలంలో చోటుచేసుకుంది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన రైతు గాండ్లపెంట రెడ్డెప్పరెడ్డి (45) బుధవారం కమతంపల్లెకు చెందిన ఓ రైతు పొలం దున్నడానికి మల్లేలగడ్డ వద్దకు ట్రాక్టర్ తీసుకెళ్లాడు. అక్కడ పొలం దున్నుతుండగా ట్రాక్టర్ మడక తగిలిచిన్నపాటి విద్యుత్తు స్తంభం పడిపోయింది. విద్యుత్తు ఉందని గమనించకుండా కింద పడిన తీగ పైకి లాగి కట్టాలని చెట్టెక్కాడు. లాగే క్రమంలో పైన విద్యుత్ లైన్‌కు తీగ తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఇతడికి భార్య శకుంతల, కమారులు హితేష్‌రెడ్డి, రుత్విక్ రెడ్డి ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ఆ కుటుంబం రోధించిన తీరు అందరినీ కలచివేసింది. ఎస్ఐ దిలీప్‌కుమార్, ట్రాన్స్‌కో డీఈ గంగాధర్, ఏడి సురేంద్ర నాయక్, ఏఈ శంకర్‌రెడ్డి సంఘటనా స్థలం పరిశీలించారు. జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

## బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రవాణా శాఖకు కీర్తి తెచ్చేలా విధులు నిర్వహించాలని రాష్ట్ర మంత్రి హితవు పలికారు. అధికార్లై ఉండి అక్రమ వసూళ్లు పాల్పడటం హేమిటి.. అధికారిని ప్రశ్నించడంపై డ్రైవర్ల ఆవేదన అర్థమవుతోంది.. అని ఆయన పేర్కొన్నారు. కడప ఆర్టీవో ఆఫీస్‌లో బ్రేక్ ఇన్స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయభాస్కర్ రాజు డ్రైవర్ల వద్ద వసూళ్లకు పాల్పడుతూ ఉన్న వీడియో వైరల్ కావడంతో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రవాణా అధికారులు యూనిఫామ్ లేకుండా రోడ్డుపై కనబడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు విన్నవిస్తామని ఆయన తెలిపారు. విధుల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని సూచించారు.



## వ్యక్తిపై పురపాలక సిబ్బంది దాడి

– విలువైన వస్తువులు ధ్వంసం

మదనపల్లె : పట్టణంలోని ఓ వ్యక్తి ఇంటిపై పురపాలక సిబ్బంది దాడికి పాల్పడ్డారు. ఇంట్లో విలువైన వస్తువులను ధ్వంసం చేశారు. బాధితుడి వివరాల మేరకు.. పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన ముబారక్ మున్సిపల్ వర్కర్ యూనియన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అదే పట్టణానికి చెరందిన పాల్ బాలాజీతో ముబారక్‌కు ఆర్థిక లావాదేవీలున్నాయి. ఇటీవల పాల్ బాలాజీ తన ఇంటిని నెహ్రూ బజార్‌లోని అలంకార్ వస్త్ర దుకాణం యజమాని శ్రీనివాస్‌కు విక్రయించాడు. మంగళవారం అకస్మాత్తుగా ముబారక్ అక్కడికి వచ్చి ఇంటిని ధ్వంసం చేయడం ప్రారంభించాడు. స్థానికులు యజమాని శ్రీనివాస్‌కు తెలుపగా.. ఎందుకు ఇంటిని ధ్వంసం చేస్తున్నావని ప్రశ్నించాడు. పాల్ బాలాజీ తనకు డబ్బులివ్వాల్సి ఉందని, ఈ ఇల్లు అతడిదే కాబట్టి ధ్వంసం చేస్తున్నానని ముబారక్ చెప్పారు. ఆ ఇల్లు తనదంటూ శ్రీనివాస్ చెప్పినా వినకుండా ఇంట్లో గ్రానైట్, ఇంటి ఎదుట అమర్చిన అద్దాలు, నీటి పైపులు ధ్వంసం చేశాడు. ఈ దౌర్జన్యాన్ని శ్రీనివాస్ వీడియో చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తే.. నన్ను ఎవరూ ఏమీ చేసుకోలేరంటూ దౌర్జన్యం చేశాడు. దీంతో శ్రీనివాస్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ముబారక్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనలో తనకు రూ.6 లక్షల నష్టం వాటిల్లిందని శ్రీనివాస్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చాంద్‌బాషా తెలిపారు. ఈ విషయమై ఎమ్మెల్యే షాజహాన్‌బాషా జోక్యం చేసుకుని, పోలీసులతో మాట్లాడి రాజీప్రయత్నాలు చేసుకోవాల్సిందిగా సూచించినట్లు తెలిసింది.

## కేబుల్ వైర్ దొంగల అరెస్ట్

**758 కిలోల తీగలు, రెండు మోటార్లు స్వాధీనం**

ఖాజీపేట : రైతుల పొలాల్లోని మోటార్లకు అమర్చిన కేబుల్ వైర్లను చోరీ చేస్తూ రైతుకు నిద్రలేకుండా చేసిన దొంగలను ఖాజీపేట పోలీసులు బుధవారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. మైదుకూరు మండలం అన్నలూరు గ్రామానికి చెందిన పిల్లరామిగాండ్ల సుబ్బరాయుడు, కొండాల రామాంజనేయులు, పిల్లరామిగాండ్ల వెంకటసుబ్బయ్య మద్యానికి బానిసలయ్యారు. సులభంగా డబ్బు సంపాదించాలని రాత్రివేళ పొలాల్లో చొరబడి మోటారుకు అమర్చిన కేబుల్ వైర్లకు కట్ చేసి చోరీ చేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఆ తీగలను ఖాజీపేటలోని గుజరీ వ్యాపారి సయ్యద్ మౌలాలికి విక్రయించి సొమ్ము చేసుకుని జల్సా చేస్తున్నారు. ఇటీవల మండలంలోని తుడుమలదిన్నె, అచ్చనపల్లె గ్రామాల్లో మోటారు వైర్ల చోరీపై 25 మంది రైతులు ఒకేసారి ఫిర్యాదు చేయడంతో ఖాజీపేట సీఐ మోహన్ ప్రత్యేక నిఘా పెట్టారు. 30న బుద్దాయపల్లె



కేబుల్ వైర్ దొంగల అరెస్టు చూపుతున్న సీఐ మోహన్

క్రాస్ వద్ద తనిఖీలు చేస్తుండగా.. సుబ్బరాయుడు, రామాంజనేయులు, వెంకటసుబ్బయ్య వైర్లతో పరారవుతూ పోలీసులకు పట్టు బడ్డారు. ఖాజీపేటలో గుజరీ వ్యాపారి సమ్యద్ మౌలాలీకి అమ్మేందుకు వైర్లు తీసుకెళ్తున్నామని చెప్పడంతో ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.98,540 విలువగల 758 కిలోల వైరు, రెండు మోటార్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



## అటవీ పరిధిలో స్మగ్లర్ల అరెస్టు



నిందితుల వివరాలను తెలియజేస్తున్న జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్

కడప అర్బన్ : బద్వేల్ అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు స్మగ్లర్లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. కడప డీఎఫ్ఓ కార్యాలయంలో విలేకరులకు డీఎఫ్ఓ వినీత్‌కుమార్ వివరాలు వెల్లడించారు. బద్వేల్ అటవీ రేంజ్‌లోని బ్రాహ్మణపల్లి సెక్షన్, బోయినపల్లి బీట్ పరిధిలో వన్యప్రాణి పెంగోలిన్(అలుగు)ను తరలిస్తున్న సమాచారం అందిందని తెలిపారు. దాడులు చేసి గోపవరం మండలానికి చెందిన రామిరెడ్డి, పాలెంకు చెందిన రాగి శ్రీను, బద్వేల్ మండలం లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన పాలగిరి పెంచలయ్య, నెల్లూరు జిల్లా వింజమూరు గ్రామానికి చెందిన లెక్కల శివారెడ్డి, మర్రిపాడుకు చెందిన వెంకటాద్రి, వింజమూరుకు చెందిన ఓంకారం బాబులను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి అలుగు, ఆటో, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**ఎర్రచందనం దుంగలు పట్టివేత**

బ్రాహ్మణపల్లి బీట్ పరిధిలో ఎర్రచందనం రవాణా చేస్తున్న కాశినాయన మండలం నారాయణపల్లె గ్రామానికి చెందిన రాంబాబు, నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మండలం అహోబిలం గ్రామానికి చెందిన తురక సుబ్బరాయుడులను అరెస్టు చేసి వారి నుంచి 109 కిలోల ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వారి అరెస్ట్ చేయడంలో కృషిచేసిన అధికారులు బి.స్వామి వివేకానంద, కె.వెంకటశేషయ్య, ఎస్ఎస్.ఖాజావలి, ఎం.పుష్పరాజ్, సి.విజయలక్ష్మి, ఎం.సువర్ణకుమార్, పి.రాజేష్‌రెడ్డి, ఎల్.లక్ష్మీనరసమ్మ, ఎస్‌డీ.మునాఫ్, ఎస్.అక్బర్‌షరీఫ్, సిబ్బందిని డీఎఫ్ఓ వినీత్‌కుమార్ అభినందించారు. స్వాధీనం చేసుకున్న పెంగోలిన్(అలుగు)కు వెటర్నరీ డాక్టర్ చే పరీక్షలు చేయించి, అటవీ ప్రదేశంలోనే సురక్షితంగా వదిలివేస్తామని డీఎఫ్ఓ తెలిపారు.

## డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు



తలపడుతున్న విజయనగరం, శ్రీకాకుళం జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ పోటీల్లో తొలిదశ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో బుధవారం బ్యాటింగ్‌కు దిగిన విజయనగరం జట్టు 70.5 ఓవర్లలో 165 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని బాబా 42, జస్టిన్ 29 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు సాత్విక్ 4, వివేక్‌నంద 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీకాకుళం జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 19 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. జట్టులోని కృష్ణ కౌశల్ 37, జోషిత్ 17 పరుగులు చేశారు. విజయనగరం బౌలర్ సాత్విక్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు 336 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో శ్రీకాకుళం జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..**

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 80 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు 80.2 ఓవర్లలో 249 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని భానుచంద్ యాదవ్ 78 పరుగులు, భానుచైతన్య 36 పరుగులు చేశారు. గుంటూరు బౌలర్లు గోపీచంద్ 4, అబ్దుల్ 2, ఖాదర్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన గుంటూరు జట్టు 38 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. జట్టులోని కౌషిక్ 69, రామ్‌చరణ 60 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో గుంటూరు జట్టు 152 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

**నెల్లూరుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం**

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 108 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 54.5 ఓవర్లలో 190 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆదినారాయణ రెడ్డి 83 పరుగులు, రోహిత్ రాయల్ 20 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్లు లీలావికాస్ 3, సాకేత్ 5, సుకాంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 52.4 ఓవర్లలో 175 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని కిన్ను కిషాల్ 67, సాయియశ్వంత్ 53 పరుగులు చేశారు. అనంత బౌలర్లు కిరణ్‌కుమార్ 4, లిఖిత్ 3, దేవస్కందారెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంత జట్టు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 264 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.